కథ

# చర్విత చరణం

-సోమిరెడ్డి జమున

"అమరేంద్ర అదృష్టవంతుడు కొడుకు అమెరికా వెళ్తున్నాడు." అమరేంద్రవైపు చూస్తూ అన్నాడు నిరంజన్.

"అది కాదు అదృష్టం - వచ్చే సంవత్సరం అమరేంద్ర కూడా అమెరికా వెళ్ళిపోతాడు" జితేంద్ర అన్నాడు నిరంజన్ వైపు తిరిగి.

"ఇంకొక్క సంవత్సరమే - ఆ తర్వాత ఈ చాలీ చాలని జీతం కోసం ఆఫీసుకు రావడానికి టైమ్ చూసుకుంటూ రానిబస్ కోసం ఎదురు చూడాల్సిన దురవస్థలేదింక అమరేంద్రా నీకు"

స్కూటర్ కూడా కొనుక్కోలేని నిరంజన్‌లో ఎదుటి మనిషి బాగుపడ్డం చూసి అభినందించే గుణం వుంది.

"కొడుకు వెయ్యి డాలర్లు పంపిస్తే ముప్ఫయి అయిదు వేలు కళ్ళతో చూస్తాడు కారే కొనుక్కోవచ్చు" కారు పిచ్చి వున్న జితేంద్ర అన్నాడు.

"కారెందుకులే ఇప్పటికైనా ఓ మంచి ఇల్లు కట్టుకోవయ్యా అమరేంద్రా" రేపో మాపో రిటైర్ అవబోతున్నా ఇల్లు కట్టుకోలేని కోదండపాణి ఉచిత సలహా పారేసాడు.

"మీరూర్కోండి మాష్టారూ! ఇక్కడ ఇల్లెందుకు? ఒక్కగానొక్క కొడుకు తల్లిదండ్రిని పిలిపించుకోడూ! అక్కడ అన్ని ఫెసిలిటీస్ వున్న ఇంట్లో దర్జాగా వుండక" ఎప్పుడూ ఊహల్లో అమెరికా వెళ్ళిపోయే మనోహర్ అన్నాడు.

"సార్! మీ అబ్బాయి వచ్చేటప్పుడు నాకొక టేప్ రికార్డర్ తెప్పించివ్వండి సార్ అక్కడ చాలా చౌకట కదా" ఆశగా అడిగాడు అటెండర్ అమరేంద్రను.

'ఎప్పుడో విషయం ఇప్పుడెందుకు అవన్నీ తర్వాత ఇప్పుడు మాకు ట్రీట్ ఇవ్వకుంటే వూర్కునేదిలేదు" ఆఫీసులో వున్న లేడీ టైపిస్ట్ కూడా వాళ్ళ మాటల్లో మాట కలిపింది.

అమరేంద్ర ఆనందపు కెరటాల్లో స్నానం చేస్తున్నాడు. అతని నోటి వెంట ఒక్క మాట కూడా రావడంలేదు. అందరి దృష్టిలో తనని అదృష్టవంతుణ్ణి చేసిన తన కొడుకుని తల్చుకుని గర్వపడ్డాడు. తన కొడుకు ప్రయాణం వారమే వుంది. వాడి కోసం మంగళ ఓ పచ్చళ్లు పిండి వంటలు తయారుచేస్తోంది.

కారు ఎయిర్‌పోర్ట్ కెళ్తున్నంతసేపు కొడుక్కి ఆరోగ్య సూత్రాలు వల్లిస్తోంది మంగళ - అమరేంద్ర కొడుకు ప్రయోజకుడవుతున్నందుకు ప్రతి క్షణం ఆనందిస్తున్నాడు.

ఎయిర్ పోర్టులో కొడుకు చెయ్యూపి వీడ్కోలు చెప్పి లోపలికెళ్తున్నప్పుడు అప్పుడే స్పృహ వచ్చిన వాడిలా ఆనందపు కెరటం దాటి లోతుకు కొట్టుకుపోయి వూపిరాడనట్లయి పోయిన భావన - అప్పటివరకు ప్రశాంతంగా వున్న మనసులో అలజడి. నెత్తిన కన్నీళ్ళ కడవ బరువు - గుండెల్లో శూన్యం - బిడ్డ దూరమయిపోతున్నాడనే వ్యాకులత అతన్ని ఒక్క మారుగా చుట్టేసాయి.

❊ ❖ ❊ ❖ ❊

నెల దాటినా అమరేంద్ర ఆలోచనలన్నీ కొడుకు దగ్గరే ఆగిపోతున్నాయి.

"మంగళా! వీడికి అక్కడ భోజనం సరిపడిందో లేదో పాపం." భార్య వడ్డించిన అన్నం వైపు చూస్తూ అన్నాడు.

"పిచ్చి సన్నాసి ఎప్పుడూ ఒక్క పనయినా చేసుకునే వాడు కాదు. అక్కడ ఎలా బట్టలుతుక్కుంటున్నాడో ఏమో!" ఇంట్లోకి వస్తున్న చాకలిని చూసి కొడుకుని తల్చుకుంటూ. "అన్నట్టు మంగళా! వాడికి సూట్ కేస్‌లో రగ్గు పెట్టావా లేదా? అక్కడ చలికి తట్టుకోగలడో లేదో? అని దిగులు పడ్తున్న భర్తవైపే చూస్తోంది మంగళ.

ఈయన గుండెల్లో కొడుకు పట్ల ఇంత అనురాగం దాగుందా? ఇరవై ఐదేళ్ళ అతని సాహచర్యంలో అంతుబట్టని ప్రశ్న ఆమెకిది.

కొడుకు దూరమవడం వల్ల తన గుండెల్లో గూడు కట్టుకున్న చిక్కటి దిగులు భర్త మాటల్లో ఇంకా చిక్కబడ్తున్నా భర్త ముందు బయట పడలేదామె... అలా బయటపడ్తే ఆమె మనస్సు తేలికవుతుంది కానీ భర్త మనస్సు మరింత భారమవడం ఆమె కిష్టం లేదు.

వెళ్ళిన మొదట్లో హుషారుగా అక్కడ కబుర్లతో కొడుకు వ్రాసిన ఉత్తరాలు చదువుకుని ఆ భార్యా భర్తలిద్దరూ కొడుకు కన్పించినంత సంబరపడ్డారు.

చాలీ చాలని జీతం రాళ్ళతో తమ అవసరాలను ప్రక్కకు నెట్టి కొడుకుని చదివించుకున్న ఆ దంపతులకు ఫోన్ లేకపోవడం కొరతనిపించలేదేనాడూ. కానీ ఇప్పుడు మాత్రం ఫోన్ కోసం ఖర్చు పెట్టుకోవాలనుకున్నారు - కొడుకు గొంతు వింటే చాలనుకుని.

రాని కొడుకు లెటర్ కోసం ఆరాట పడడం అలవాటయి పోయిన ఆ దంపతులు మొదటిసారి అప్పుచేసి ఫోన్ కనెక్షన్ ఇప్పించుకున్నారు. ఎంతవుతుందిలే అనుకుని ఆనందంగా కొడుక్కి ఫోన్ చేసుకోవడం అలవాటయిపోయింది. వాళ్ళానందం ఆవిరయిపోయింది ఫోన్ బిల్ చూసి.

బిడ్డ అమెరికా వెళ్ళాడన్న గర్వంలో, ఆ మైకంలో కొంత, ఒక్కగా నొక్క కొడుకు మీద ఎదలో పొంగే ప్రేమతో కొంత, పుత్రుని ఎడ బాటు వల్ల మిగిలిన ఒంటరి భావంతో మరి కొంత, తను చేసిన పొరపాటది. ఆ పొరపాటు ఖరీదు ఆ టెలిఫోన్ బిల్‌లో ఫిగర్ అతన్ని హఠాత్తుగా అప్పులు అనే అంధకారంలో చుట్టేసింది. ఆ అంధ కారంలో కొడుక్కి ఫోన్ చెయ్యాలనే కోరిక సమాధి అయిపోయింది.

వారాలు నెలల్లోకి, నెలలు సంవత్సరంలోకి గిర్రున తిరిగిపోయాయి. అక్కడ కొడుకు బాధ్యతల్లో పడిపోయి లెటర్స్ రాయడం తగ్గిపోయింది. ఒక్క లెటర్ వ్రాయి నీ కబుర్లతో అని కొడుకుతో ఫోన్‌లో చెప్తే నేను ఫోన్ చేస్తున్నాగా నాన్నా అని కొడుకు అనడంతో కొడుకు దగ్గరనుండి లెటర్స్ రావడం అనేది ఆగిపోయింది. ఫోన్‌లో మాట్లాడుకునే పది నిముషాలు ఏమి మాట్లాడాలో తోచేది కాదు - అరిగిపోయిన గ్రామ్ ఫోన్ రికార్డులా యోగ క్షేమాలు మాత్రమే ఫోన్‌కు పరిమితమయిపోయాయి.

"మంగళా! వీడి గొంతలా వుందేమిటి? ఫ్లోలో దగ్గుతున్నాడు కూడా ప్చ్! ఏమిటో అంత దూరం పంపకపోవాల్సింది కలో గంజో తాగి ముగ్గురం ఒకే చోట వుంటే పోయేది. వాడి ఆలనా పాలనా చూడ్డానికి నువ్వు కూడా అక్కడ లేకపోతివి.... ఎన్ని అవస్థలు పడ్తున్నాడో ఏమో!" ఫోన్ పెట్టేసిన తర్వాత విచారంగా అన్నాడు అమరేంద్ర.

"అక్కడన్నిటికీ మిషన్స్ వుంటాయని చెప్పాడుగా. వాడికక్కడ కష్టంగా వుంటే మనకి చెప్పేవాడే కదా. మీరేమీ దిగులుపడకండి."

"అంతేనంటావా? మరి అమెరికాలో జలుబే పెద్ద జబ్బుట చలి ప్రదేశం కదా."

"మీరు భోజనానికి రండి. వాడక్కడ హాయిగా వున్నాడు."

అలా అన్నదే కానీ కొడుకుని చూసి సంవత్సరమయిందని దిగులు పడ్తూనే వుంది మంగళ కూడా.

"తల్లిదండ్రుల్ని, బిడ్డని వేరు చేసే ఆ సంపాదన లేకపోతేనేం?" మనస్సులోనే బాధపడింది మంగళ.

❊ ❖ ❊ ❖ ❊

"అనుకోకుండా మా పెళ్ళయిపోయింది. మాకు వీలున్నప్పుడు మీ దగ్గరకొస్తాము" రెండు సంవత్సరాల తర్వాత అలా చెప్పి ఫోన్ పెట్టేసిన కొడుకు మీద కోపం వచ్చింది అమరేంద్రకు.

"చూసావా మంగళా! వీడికి మనమీద ప్రేముంటే ఒక్క మాట చెప్పి ఫోన్ పెట్టేస్తాడా? కనీసం ఆ అమ్మాయి ఎవరో? ఎలా వుందో అయినా చెప్పాడా? పెళ్ళెప్పుడు చేసుకున్నాడో చెప్పాడా? ఆ అమ్మాయిని తీసుకుని ఇక్కడకు ఎప్పుడొస్తాడో చెప్పాడా?

నిట్టూర్చింది మంగళ. ఇప్పుడు దిగులుపడి ప్రయోజనం ఏమిటి? రెక్కలు విప్పుకుని వెళ్ళిపోయాక.

"చూసావా మంగళా! వాడెళ్ళి మూడు సంవత్సరాలయిందా? అక్కడ బాగా

సంపాయిస్తున్నాడు - వాడికి మనం గుర్తున్నామా? నాకు పంపకపోతే మానె తల్లివి నీకైనా ఏమైనా పంపించాడా? నీ నగలన్నీ అమ్మి టిక్కెట్టుకొని పంపించావు కదా! కనీసం నిన్ను నగలు కొనుక్కోమనయినా డబ్బు పంపాడా?" తన మేనమామ కొడుకు వచ్చి అక్కడ తన కొడుకు వైభోగం చెప్పి వెళ్ళిపోయాక అన్నాడు బాధగా అమరేంద్ర.

"వూర్కోండి ఎందుకలా బాధపడ్తారు? నాకు లేదూ బాధ. తప్పదు దిగమ్రింగుకుని వదిలేయాలి - మన బిడ్డ క్షేమంగా అమెరికాలో వున్నాడు. ఆ తృప్తితో బ్రతికేయాలింక మనం."

"నీలాగా నేనుండ లేను... ఎందుకొడులు కోవాలి మన బిడ్డను. ఆ మాత్రానికి బిడ్డను కనడం ఎందుకు? పెంచడమెం దుకు? ఈ ప్రేమలెందుకు? ఈ పాశం ఎందుకు?" కాస్త ఆవేశం అతని గొంతులో.

"ఇంత మాత్రం అదృ ష్టమే మన నుదుట వ్రాసి పెట్టుంది అనుకుని సర్దుకు పోవాలంతే."

తన కొడుక్కి బిడ్డ పుట్టినా ఒక్కసారి భార్యను, బిడ్డను అమ్మానాన్నలకు చూపించాలనుకోని కొడు కుని తల్చుకుని బాధపడ్తూ అంది మంగళ.

"వాడికి పుట్టిన బిడ్డ వాణ్ని ప్రేమించకపోతే తెలుస్తుందప్పుడు వాడికి... మన బాధేంటో" ఈ మారు చాలా విరక్తిగా అన్నాడు అమరేంద్ర.

ఉలిక్కిపడింది మం గళ.

"ఇలాంటి శాపం ఇం కెవ్వరికీ వుండకూడ దండీ..... మన బిడ్డ శ్రేయస్సే మనం కోరుకో వాలి అంతే...." స్వంత కొడుకు గురించి ఇలా మాట్లాడుకోవడం ఇష్టం లేని మంగళ అక్కడ నుండి పెరట్లోకివెళ్ళి పోయింది.



❁❖❁❖

"ఏరా ఇంద్రయ్యా చంటోడు జాబు వ్రాస్తున్నాడా? వాడికక్కడ పనులు వూపిరి సలపక రాలేదనుకో. మీరిద్దరయినా వెళ్ళిరాకూడదూ!"

పల్లె నుండి వచ్చిన అమరేంద్ర ముసలి తల్లిదండ్రులు రాగానే అడిగారు.

"మద్రాస్ అనుకున్నారా వెళ్ళి చూసి రావడానికి. వాడికుండాలి అమ్మను నాన్నను చూడాలని."

"ఏమిటయ్యా ఇలా చిక్కిపోయావు?" మాట మార్చింది ముసలామె.

"కొడుకు మీద బెంగత్తయ్యా ఈయనకు" మంగళ అత్తగారి చేతిలో సంచి అందుకుంటూ అంది.

"అది సహజమే కదా తల్లీ! మాకూ మీరు కళ్ళల్లో మెదిలి వచ్చేసాము.... ఒక్క సారి మీరిద్దరూ రాలేకపోయారాయ్యా!" నిదానంగా అడిగిందామె అమరేంద్రను.

"ఎక్కడమ్మా రావాలంటే కుదరడం లేదు నీ మనమడు ఎప్పుడు ఫోన్ చేస్తాడో తెలియదాయె. అదీకాక ఇల్లు కట్టించుకుంటున్నాను తీరిక దొరికితేగా."

"పోనీలేయ్యా! మీరెక్కడున్నా హాయిగా వుండడమే మాకు కావాల్సింది - ఇల్లు కట్టడానికి చంటోడు పంపించాడా డబ్బు?" కుతూహలంగా అడిగింది ముసలామె.

"ఏం నీ మనమడు పంపించకపోతే నేనిల్లు కట్టుకోలేనా?" చర్రున కోపమొచ్చింది అమరేంద్రకు.

"కోపం ఎందుకురా అది తెలివి తక్కువ వాగుడు వాగు తుందిలే" సర్దాడు అమరేంద్ర తండ్రి.

వెంటనే కోపాన్ని కంట్రోల్ చేసుకుని అన్నాడు తల్లితో అమ రేంద్ర.

"వాడు డబ్బు పంప క్కరలేదమ్మా కనీసం... కనీసం ఒక్కసారి మనల్ని చూడాలని అనిపించడం లేదు వాడికి. అదే నా బాధ."

"వూర్కో రాయ్యా నిన్ను బాధపెట్టాను. వస్తా డులే కుర్రనాగన్న పెళ్ళి చేసుకున్న మోజు అదీ కాక పసి బిడ్డను తీసుకుని రావాలంటే ఆ చలిలో మాటలా? మనమూ అర్థం చేసుకోవాలి" కొడు కును ఓదార్చిందామె.

ఇంతలో ఫోన్ మోగింది. అమరేంద్ర ముఖం వికసించింది అక్కడే నిల్చున్న మంగళ ఫోన్ అందుకుంది.

"హలో! ఏరా బాగు న్నావా? ఆ.... అలాగే పంపిస్తాము.... ఇంకేం కావాలి.... ఆ... ఆ... అన్నీ పంపిస్తాను. బాబు బాగు న్నాడా? ఏం పేరు పెట్టారు? కోడలు బాగుందా? ఇదిగో నాన్న వచ్చాడు మాట్లాడు. మీ నాన్నమ్మ తాతయ్య వచ్చున్నారు మాట్లాడతావా?..... సరేలే."

ఫోన్ దగ్గరకు అమరేంద్రతోపాటు వచ్చారా ముసలి దంపతులు మనవడితో మాట్లాడాలనే ఆరాటంతో.

అమరేంద్ర ముఖంలో గిల్టీ ఫీలింగ్.... కనీసం వీడికి సభ్యత పాటించాలనే ఇంగితం కూడా ఎందుకు లేకపోయింది. తనతో మాట్లాడకపోతే మానె. తన తండ్రితో ఒక్క మాట మాట్లాడితే ఆయనెంత సంతోషపడేవాడు.

ముసలాయనకర్థమయిపోయింది. అందుకే అతను తన ఆరాటాన్ని వ్యక్త

పర్చలేదు.

"బిజీగా వున్నాడట మామయ్యా మళ్లీ చేస్తానని చెప్పమన్నాడు" తను చెప్పేది అబద్ధమని మామగారికి తెలుస్తోందని మంగళకు తెల్సు.

"అదిసర్లే పాపం" తను కోడలు చెప్పిన అబద్ధం నమ్మినట్లు నటించినా కోడలికి మామ అర్థమయ్యాడు.

"వాడు ఏమిటీ పంపించమ న్నదీ" ఆ ముసలామె మనమడు మాట్లాడకపోయినా పట్టించుకోకుండా అడిగింది.

"ఇండియాకు వాడి ఫ్రెండ్ వస్తున్నాడట. కోడలికి కంచి పట్టుచీర - అరిసెలు జంతికలు పచ్చళ్ళు చేసి పంపమన్నాడు. ముఖ్యంగా బంగారు రేకులు పంపించమన్నాడు మళ్లీ కోడలు నెల తప్పిందట. వేడన్నంలో బంగారు రేకులు వేసుకుని తినాలనుందట."

హఠాత్తుగా కొడుకుని క్షమించేసాడు అమరేంద్ర. అప్పటికప్పుడు ప్రయాణమయి కోడలికి కంచి పట్టు చీరకొని తెచ్చాడు. బంగారు రేకులు కోడలి కోసం కొన్నాడు. కొడుక్కి ఇష్టమైన పచ్చళ్ళు - పిండి వంటలు చేయించాడు, అనారోగ్యపు తల్లికి కూడా పురమాయించి.

తన కోసం కొడుకు పంపిన ఎలక్ట్రిక్ షేవింగ్ సెట్ చూసి మురిసిపోయాడు. ఆటోమాటిక్ రైస్ కుక్కర్ చూసి మంగళకంటే అమరేంద్రే ఆనందించాడు.

## చిచ్చర పిడుగు

ఫ్రాన్స్‌లోని ఛాటర్ నార్డ్‌లో నివసించే ఎరిక్, సేలిడైమ్‌ల కుమార్తె సబీనా గయోలోట్ (5 సం॥) ఆ వయసు పిల్లలు ఎవరూ చెయ్యలేని ఫీట్స్ చేస్తోంది. కేవలం మూడు న్నర అడుగుల ఎత్తున్న సబీనా గుర్రపు స్వారీ చేస్తుంది. సబీనాకి నడక పూర్తిగా రాక మునుపు నుంచే గుర్రపు స్వారీని తల్లిదండ్రులు నేర్పించారు.



'ఇంత మాత్రానికి నీ కొడుక్కి నీమీద ప్రేమ లేదని వాపోతివి" కొడుకుతో అన్నాడా వృద్ధుడు.

"వస్తువులు చూసి మురిసిపోలేదు నాన్నా! వాడికి మేము గుర్తున్నందుకు ఆనందం అంతే...." అమరేంద్ర కంఠంలో ఆనందం.

పాక్ చేసిన వస్తువులన్నీ తన కొడుకు స్నేహితుడికందిస్తూ కొడుకు మీద కోపం మర్చి పోయి కొడుకు గురించి తెల్సుకుని ఆనందించాడు.

తనకోసం పంపిన పగడాల దండను ఆప్యాయంగా తన అత్తగారి మెడలో వేసి "మీ కోసం మీ మనమడు పంపాడత్తయ్యా" అని అబద్ధమాడింది మంగళ.

"ఇంక మేం వెళ్తామురా. అప్పుడప్పుడు మంగళని తీసుకుని వస్తుండయ్యా మేము ముసలోళ్ళమయిపోయాము. ఇంక ప్రయాణం చేసే ఓపిక వుండడం లేదు."

"ఎక్కడమ్మా రావాలని లేకకాదు, కుదరడం లేదు ఏదో ఒక బాధ్యత.. వస్తాంలే ఒకరోజు" అమరేంద్ర తల్లిదండ్రుల్ని సాగనంపడానికి వాకిట్లో కొస్తూ అన్నాడు.

"ఇంద్రయ్యా! పూరి కప్పంతా పడిపోయింది. ఇల్లంతా కురుస్తోంది. ఇంతకు మునుపు పొలంలో వచ్చే గడ్డితో తాటాకుతో ఇల్లు కప్పుకుంటుంటే తెలియలేదు" అమరేంద్రతో అంది ఆ వృద్ధురాలు.

"ఆ డబ్బు వడ్డీకిచ్చుకున్నారు కదమ్మా! గడ్డి కొని కప్పింకోకూడదూ!"

"ఆ వడ్డీ ఎంతరా వెయ్యి వస్తుంది. ఎన్ని ఖర్చులు చెప్పు ముసలోళ్ళ మయిపోతున్నామా? మందుల ఖర్చొకటొచ్చి పడిందయ్యా. ఇకపోతే బియ్యం కూడా కొనాల్సివచ్చే." సంచి చేత బట్టుకుంటూ అందామె.

"ఈ సంవత్సరం సర్దుకోండమ్మా వచ్చే సంవత్సరం పూరి కప్పు వేయిస్తాను."

"పూరి కప్పు మాత్రం తక్కువవుతుందా? నాలుగు రేకులు కొని వేయించావంటే శాశ్వతంగా వుంటుంది." అప్పటివరకు నోరు మెదపని అమరేంద్ర తండ్రి నోరు విప్పి అడిగాడు.

"ఈ రేట్లల్లో రేకులంటే మాటలా? అదయ్యే పనికాదులే నాన్నా! ఇప్పటికే నాకు ఖర్చులెక్కు వయ్యాయి."

"పోనీలేయ్యా! నువ్విబ్బందిపడకు. మాపాట్లేమిటో మేము పడ్తాంలే. మీరు సంతోషంగా వుండండి మాకంతే చాలు." గడప దాటబోతున్న ఆ ముసలామె లోపలికి వచ్చి అంది.

మంగళ మనస్సు చివుక్కుమంది.

తల్లిదండ్రుల బాధ్యత తీసుకుని వాళ్ళిద్దర్నీ తన దగ్గరే వుంచుకుని ఈ వయస్సులో వాళ్ళని సంతోష పెట్టాల్సిన వారు తన భర్త, అలాటిది వాళ్ళు వేరుగా ఆ పల్లెలో వుంటే వెళ్ళి వాళ్ళవసరాలు తీర్చాల్సింది పోయి - ఆ వయస్సులో వాళ్ళే, తన భర్తను చూద్దామనివస్తే ఇప్పుడయినా వాళ్ళవసరాలు తీర్చకపోగా ఇప్పుడు వీలవదని ఖండితంగా ఎలా చెప్పగలుగుతున్నారు?

ఆ ముసలి తల్లిదండ్రుల ముందే డబ్బు ఖర్చుపెట్టి తన కోడలికి చీర - అడక్కపోయినా మనమడి కోసం పులిగోరు వేయించిన దండ తెచ్చాడు తన భర్త. ఎంత స్వార్థం....

తన బిడ్డకు తన మీద ప్రేమ లేదని వాపోయి బిడ్డ ప్రేమ కోసం వెంపర్లాడే తన భర్త ఒక్క నిముషం ఆలోచించి వుంటే తల్లిదండ్రులకు ఆ జవాబు చెప్పేవారా? తనని చూడ్డానికి తన కొడుకు రాలేదని దిగులుపడే తన భర్త ఆయన తల్లిదండ్రుల్ని చూడ్డానికెళ్తున్నాడా? వాళ్ళడిగిన నాలుగు రేకులు కొనివ్వలేని స్థితిలో వున్నాడా? తల్లిదండ్రులడిగిన రేకుల ఖర్చు భారమయ్యిందా? అలాటప్పుడు కోడలికి మనమడికి అయిన ఖర్చు భారమనిపించలేదా?" మంగళకి ఈరోజు కంటి ముందు తన భర్తకు తన కొడుకు, తండ్రి వేర్వేరుగా కన్పించడం నచ్చలేదు.

తన కొడుకు పంపించిన షేవింగ్ సెట్‌తో తన పట్ల ప్రేమను తల్చుకుని ఆనందించినట్లే తన తల్లిదండ్రులకూ ఆ ఆనందాన్ని మిగల్చాలని ఎందుకనుకోవడంలేదు? తన కొడుకు, కోడలు, మనమడు వచ్చి తనింట్లో కళకళలాడ్తూ తిరుగుతుంటే ఎంత సంతోషంగా వుంటుందని వాళ్ళకోసం ఎదురుచూసే తన భర్త, అమ్మానాన్న ఇదే ఇంట్లో వుండాలని ఎందుకు కోరుకోవడం లేదు? పోనీ ఆ తల్లీదండ్రీ కూడా తన కొడుకు-కోడలు తమ పూరి పాకకు వస్తే ఆనంద పడ్తారనే విషయం ఎందుకర్థం కావడం లేదీయనకు?

మంగళ మనస్సు కలిచివేసింది. మంగళ హృదయంలో తళుక్కున ఓమెరుపు - ఆ మెరుపులో నుండి ఆనందం - తృప్తి....

తమ కోసం ఆరాటపడని బిడ్డ కోసం ఎందుకు చింతపడాలి? తమని అభిమానించి, తమ శ్రేయస్సు కోసం ఆరాటపడే అత్త మామలను చూసుకుని ఎందుకానందపడకూడదు? బిడ్డ మీదున్న ప్రేమను, పాశాన్ని అవృద్ధులయిన ప్రేమ మూర్తుల మీదికెందుకు మళ్లించకూడదు? తమ బిడ్డ అనే స్వార్థంతో, ప్రేమతో వాళ్ళెన్ని తప్పులు చేసినా క్షమించగలిగే తల్లిదండ్రులు ఒక్క నిముషం ఆలోచించి తమ నుంచి కేవలం ప్రేమను మాత్రం ఆశించే తమ తల్లి దండ్రులనెందుకు సంతోష పెట్టకూడదు? అత్తమామ గడప దాటబోతున్నారు. చప్పున వెళ్ళి అత్త చేతిలో సంచి అందుకుంది మంగళ.

"నువ్వెందుకు లేమ్మా బస్టాండుకు. మేమెళ్ళగలంలే. నువ్వు ఇంద్రయ్యకు టిఫెన్ పెట్టు. ఇప్పటికే ఎండబడిపోయింది." కొడుక్కు ఆకలవుతుందేమో అన్న ఆలోచన ఆ తల్లిది.

ఆమె అభిమానానికి, ఆప్యాయతకు మంగళ కళ్ళు చెమర్చాయి.

"మీరు పూరికెళ్ళడం లేదత్తయ్యా. మాతోనే వుంటున్నారు..... ఆ పల్లెలో మీకు వైద్య సౌకర్యం వుండదు. అందరం ఒక దగ్గరే వుందాము. కష్టము, సుఖము కలబోసుకుని." ఆమె గొంతులో దృఢ నిశ్చయం. ఆ వృద్ధుల కళ్ళల్లో మెరుపు.

మంగళ ముఖంలో ఆనందం. ❑